క్లుప్తంగా

ఉపవాస ప్రార్థనలపై ప్రచారం



దెందులూరు మన్నా చర్చిలో పోస్టర్లను విడుదల చేసిన పాస్టర్లు

దెందులూరు: దెందులూరు మన్నా చర్చిలో ఈ నెల 17 నుంచి 28 వరకు ఉపవాస కూడిక, ప్రార్థనలు నిర్వహిస్తున్నామని మన్నా చర్చి పాస్టర్ బెంజిమెన్, రత్నకుమారి అన్నారు. మంగళవారం చర్చిలో పాస్టర్లతో కలిసి ప్రార్థనలపై రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. 12 మంది సువార్తీకులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఉపవాస కూడికల్లో వాక్య సందేశం అందిస్తారన్నారు. ప్రతిరోజు ఉదయం 11 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఉపవాస కూడికలు కొనసాగుతాయని పాస్టర్ బెంజిమెన్, రత్నకుమారి వివరించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



కాశిపాడులో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆహార నియమాలు అనుసరించాలని వ్యవసాయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం గణపవరం మండలం కాశిపాడులో వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇళ్ల సమీపంలో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని, వేడి ఆహారం తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుంగిన పోతునూరు మెయిన్ రోడ్డు



కుంగిన పోతునూరు మెయిన్ రోడ్డు

దెందులూరు: పోతునూరు– గుండుగొలను వెళ్లే దారిలో అట్టల ఫ్యాక్టరీ వద్ద రోడ్డులో కొంత భాగం కుంగిపోయింది. కుంగిపోయిన ప్రాంతం పక్కన డ్రెయినేజీ ఉండటంతో రోజురోజుకూ కోత భాగం అధికమవుతోందని ప్రయాణికులు తెలిపారు. ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి రక్షణ చర్యలు చేపట్టాలని దెందులూరు– గుండుగొలను ప్రజలు కోరారు.

భక్తిశ్రద్ధలతో వేళంకణి ఆరోగ్యమాత ఉత్సవాలు



వేళంగిణి ఆరోగ్యమాతకు పూజలు చేస్తున్న ఏలూరు పీఠాధిపతి, కార్యదర్శి ఫాదర్ ఎస్. స్టీఫెన్, ఫాదర్ మోజెస్

దెందులూరు: వేగవరంలోని వేళంకణి ఆరోగ్యమాత ఉత్సవాల్లో పాల్గొనడం భక్తులందరికీ ఆశీర్వాదకరమని ఏలూరు పీఠాధిపతి, కార్యదర్శి ఫాదర్ ఎస్.స్టీఫెన్ అన్నారు. మంగళవారం వేగవరంలోని వేళంకణి ఆరోగ్యమాత ఉత్సవాల్లో ఎస్.స్టీఫెన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఫాదర్లు మోజెస్, స్టీఫెన్, సంఘస్తులతో కలిసి దివ్యపూజాబలి అర్పించారు. అనంతరం వేళంకణి ఆరోగ్యమాత ప్రతిమతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కుటుంబరావు మృతి



కుటుంబరావు (ఫైల్)

దెందులూరు: ఇండ్రి కనర్సింహపురం గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్‌నేత, మాజీ ఎంపీటీసీ భర్త సరిపల్లి కుటుంబరావు (72) మంగళవారం అనారోగ్యంతో ఏలూరు ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తల మధ్య అవినాభావ సంబంధానికి కృషి చేస్తూ పార్టీలో సీనియర్ నేతగా ఆయన మెట్ట గ్రామాల్లో గుర్తింపు పొందారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని గ్రామ నాయకులు అన్నారు. గ్రామ నాయకులు కుటుంబరావు కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

కొల్లేరులోకి పోటెత్తుతున్న వరద నీరు

- పెరుగుతున్న నీటి మట్టాలు
- మల్లవరం వద్ద గ్రావెల్ బస్తాలతో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట



మల్లవరం సమీపంలో కాలువ గట్టుపై బస్తాలు వేసి అడ్డుకట్ట వేసే పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో



ఉధృతంగా ప్రవహిస్తున్న ఆగడాలలంక ఛానల్

భీమడోలు: కొల్లేరులోకి చేరే వరద నీరు రోజురోజుకూ పెరుగుతోంది. దీనితో కొల్లేరు వాసులు ఆందోళన చెందుతున్నారు. ఎగువ ప్రాంతాలు సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత కొల్లేరులో నీటి మట్టం పెరుగుతుంది. ఎగువ నుంచి వచ్చే ముంపు నీరంతా ఆగడాలలంక ఛానల్ రోడ్డు పరిధిలోని చెట్టున్నపాడు నుంచి మల్లవరం వరకు గల రోడ్డుపై పలు చోట్ల నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దీనితో అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. ఎగువ నుంచి వచ్చే నీటితో కొల్లేరు ఎగదన్నుతుంది. దీనితో కొల్లేరుకు పోటెత్తుతున్న వరద నీటికి అడ్డుకట్ట వేయకుంటే రోడ్డుకు గండి పడే అవకాశాలుంటాయని, దీనితో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని భావించిన అధికారులు అడ్డుకట్ట వేసే పనిలో నిమగ్నమయ్యారు. తగు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే తమ్మిలేరు నీరంతా నల్లకోడు డ్రెయిన్ ద్వారా కొల్లేరులోకి చేరుతుంది. దీనితో డ్రెయిన్లు ఉధృతిగా ప్రవహిస్తున్నాయి. వర్షాలు ప్రారంభమైన నాటి నుంచి గోదావరి కాలువ నీటిని ఇరిగేషన్ అధికారులు ఆగడాలలంక ఛానల్‌కు విడుదల నిలిపివేశారు. ఎగువ నుంచి వచ్చే నీరంతా డ్రెయిన్లతో పాటు ఆగడాలలంక ఛానల్‌లోకి చేరింది. దీనితో కాలువ ఉధృతిగా పొంగి ప్రవహిస్తోంది. ఒక్క పక్క తమ్మిలేరు వరద నీరు, మరో పక్క ఆగడాలలంక ఛానల్‌కి వచ్చి చేరే నీటితో రోడ్లను తాకుతూ ముంపు నీరు ప్రవహిస్తోంది. దీనితో చెట్టున్నపాడు నుంచి మల్లవరంని రోడ్డులో పల్లంగా ఉన్న చోట్ల నీరంతా రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. తక్షణమే స్పందించిన ఎంపీడీవో సీహెచ్ పద్మావతి నీరు రోడ్లపైకి రాకుండా తగు చర్యలు చేపట్టారు. వివిధ శాఖల సిబ్బంది సహకారంతో ఆమె దగ్గరుండి మంగళవారం కాలువ గట్టుపై గ్రావెల్ బస్తాలతో అడ్డుకట్ట వేశారు. ఎగువ నుంచి వచ్చే ముంపు నీరంతా డ్రెయిన్ల ద్వారా కొల్లేరులోకి చేరేందుకు కొన్ని రోజులు పడే అవకాశాలున్నందున అప్రమత్తంగా ఉండాలని మండల స్థాయి అధికారులకు ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. చెట్టున్నపాడు, మల్లవరం, ఆగడాలలంక తదితర గ్రామాల్లోని కొల్లేరుకు ఆనుకున్న ఉన్న కాలనీల్లోని నీరు చేరుతుందని కొల్లేరు వాసులు ఆందోళన చెందుతున్నారు. మల్లవరం పాఠశాల ముంపుబారిన పడడంతో అధికారులు పాఠశాలలోని నీటిని బయటకు తోడేసారు. బుధవారం పాఠశాల యథావిధిగా పని చేస్తుందని మండల విద్యాశాఖాధికారులు తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వస్తున్నారు. ఈవోఆర్‌డీ ఏ.సుందరి, వీఆర్వోలు, గ్రామకార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు సహకరించారు.

లోతట్టు ప్రాంతాన్ని పరిశీలించిన ఎంపీడీఓ

దెందులూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు కొల్లేరు వరదబారిన పడకుండా లోతట్టు ప్రాంతమైన మాధవరం గ్రామాన్ని మంగళవారం దెందులూరు ఎంపీడీఓ వి.శ్రీలత పరిశీలించారు. వరదకు అవకాశం ఉన్న 10 ఇళ్లను, రోడ్లను స్వయంగా ఎంపీడీ పరిశీలించారు. స్థానికుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. రక్షణ చర్యగా పది కుటుంబాలు కమ్యూనిటీ హాలు, పాఠశాలలో ఉంటే మంచిదని సూచించారు. తాగునీరు, విద్యుత్, ఆహారం, ఇతర కనీస అవసరాలపై సమీక్షించారు. వీఆర్వో, గ్రామ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలో సమాచారం తనకు, తహసీల్దార్‌కు తెలియజేయాలన్నారు. రాత్రివేళల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ కార్యదర్శి షరీఫ్, వీఆర్వో శ్రీను, సచివాలయ ఉద్యోగులు, గ్రామ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

జాబ్‌మేళాలో 67 మందికి ఉద్యోగావకాశాలు



జాబ్‌మేళాలో ఎంపికైన యువతీయువకులు

భీమడోలు: భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 67 మంది ఉద్యోగావకాశాలు పొందారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బాబ్‌మేళాకు మండల వ్యాప్తంగా 119 మంది నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వివిధ కార్పొరేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన 67 మందిని ఎంపిక చేసుకున్నారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ తెలిపారు. వారికి నియామక పత్రాలను అందించారు. ఈ జాబ్ మేళాలో ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్, స్కిల్ హబ్ ఇంచార్జి జంగం రాము, జిల్లా ఉద్యోగ కల్పనాధికారి ప్రవీణ్, కోఆర్డినేటర్లు సురేష్, సత్యనారాయణ, దుర్గాభవానీ పాల్గొన్నారు.

వరద నష్టాన్ని పారదర్శకంగా నమోదు చేయాలి



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి

భీమడోలు: వరద నష్టం అంచనాలను క్షేత్రస్థాయి అధికారులు పారదర్శకంగా నమోదు చేయాలని ఏలూరు ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో మంగళవారం వరద నష్టం అంచనాల తయారీ చేసే అంశాలపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద నష్టాలను అంచనాలు వేసేందుకు ప్రభుత్వం 20 అంశాలతో కూడిన ప్రత్యేక ఫార్మేట్‌ను రూపొందించిందని, దీనిలో గ్రామాలు, విభాగాల వారీగా వరద నష్టం అంచనాలను నమోదు చేయాలని కోరారు. ఇదే క్రమంలో వరద తగ్గుముఖం పట్టిన తర్వాత పారిశుధ్య పరిరక్షణ చర్యలను ఆ గ్రామాల్లో ముమ్మరంగా చేపట్టాలని, తాగునీటి నాణ్యత పరీక్షలు చేసి తదనుగుణంగా శుద్ధి చేసిన నీటిని ప్రజలక సరఫరా చేయాలన్నారు. తరుణంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే చేయాలన్నారు. వర్షాలకు తడిసి ఇండ్లు నష్టపోయిన బాధితుల వివరాలను సేకరించాలన్నారు. నష్టపరిహారం ఇచ్చేందుకు తగు నివేదికలు సిద్ధం అందజేయాలన్నారు. ఆగడాలలంకలో పశుగ్రాసం కొరత ఉందని గుర్తించామని, ఐదు రోజులకు సరిపడా పశువులు, మేకలు, ఇతర జీవులకు పశుదాణా పంపిణీ చేసేందుకు తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, తహసీల్దార్ బి.రమాదేవి, ఏవో ఉషారాణి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జీవో 85 తక్షణమే రద్దు చేయాలి



పూళ్లలో నల్లబ్యాడ్జీలను ధరించి వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారిణి కల్యాణీమహేశ్వరి

భీమడోలు: వైద్యుల పాలిట గుదిబండగా మారిన జీవో 85ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ భీమడోలు మండలంలోని పీహెచ్‌సీలు, సామాజిక వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలను ధరించి వైద్యులు రోగులకు వైద్య సేవలందించారు. పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీసు కోటాను 30శాతం నుంచి 15శాతానికి కుదిస్తూ ప్రభుత్వం జీవో 85ను జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ రెండు నెలలుగా పీహెచ్‌సీ వైద్యులు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా వారి విజ్ఞప్తిని ఖాతరు చేయకపోవడంతో వైద్యుల సంఘం ఆందోళన బాట పట్టింది. ఈ నేపథ్యంలో పూళ్ల, గుండుగొలనులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సామాజిక ఆరోగ్య కేంద్రంలో పలువురు వైద్యులు ఆందోళన కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు ఈ.కల్యాణీమహేశ్వరి, అరుణజ్యోతి, శ్రీలక్ష్మీ తదితరులు నల్లబ్యాడ్జిలను ధరించి నిరసన తెలిపారు. రోగులకు వైద్య సేవలందించారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని వారన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్): ఎనీమియా రాకుండా ఉండాలంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఏలూరు ప్రాజెక్టు సీడీపీఓ ఎ.పద్మావతి కోరారు. స్థానిక పవరుపేట యూపీహెచ్‌సీలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే రాగిపిండి, అటుకులు, బెల్లం, ఖర్జూరం, చిక్కీలు తినడం ద్వారా గర్భిణులు, బాలింతలు ఎనీమియాను దూరం పెట్టవచ్చని అన్నారు. డాక్టర్ గౌతమ్‌రాజ్ మాట్లాడుతూ ప్రతి నెలా 9, 10 తేదీల్లో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం మౌనిక, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు. మంచి ఆహారంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించవచ్చునని డాక్టర్ బి.బాలకృష్ణ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పోషకాహారం తినడం ద్వారా ఎనీమియా రాకుండా చూడవచ్చునని సీడీపీఓ ఎ.పద్మావతి అన్నారు. ఏలూరు ప్రాజెక్టు 3వ నెంబరు గజ్జెలవారి చెరువు యూహెచ్‌సీలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మీనాక్షి, అంగన్‌డీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

బాలికల భద్రతపై అవగాహన

కామవరపుకోట: మండలంలో రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ కోకో లైఫ్ కంపెనీలు ఏలూరు ప్రతినిధులు రాజేష్, అశోక్ ఆధ్వర్యంలో భద్రత పరిరక్షణ, ఆరోగ్యం, సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ పుష్పావతి మాట్లాడుతూ బాలికలు తమ రక్షణకు పరిష్కార మార్గాలు, బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై విద్యార్థినులకు వివరించారు. అవసరమైతే హెల్ప్ లైన్ నెంబర్ 1098కి, 100, 181, 112లకు ఫోన్ చేయొచ్చని తెలిపారు.

వరద బాధితులకు విరాళాల వెల్లువ

ఉంగుటూరు: వరద బాధితులు సాయం కోసం కాగుపాడు మాజీ సర్పంచి కడియాల రవిశంకర్ గ్రామం తరపున రూ.3.02 లక్షల చెక్కును ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు సూరత్తుల అయ్యప్ప, ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి విజయకుమార్ పాల్గొన్నారు.

వరద బాధితులకు బుడతల సాయం

ఉంగుటూరు: విజయవాడ వరద బాధితులకు కొత్తగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విరాళాలు సేకరించారు.రూ.12,275 సేకరించారు. విరాళాలు సేకరించిన విద్యార్థులు యాజమాన్య కమిటీ చైర్మన్ కె.దేవి, ప్రధానోపాధ్యాయులు కొమ్మోమజు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు కె.వి. లక్ష్మి, ఎన్ జాస్సీరాణి, ఎంఈవో నిమ్మగడ్డ రవీంద్ర భారతి, ఎంఈవో 2 భాస్కర్‌కుమార్ అభినందించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

భీమడోలు: పోషక విలువలు గల చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా భీమడోలు ప్రాజెక్టు స్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన రుచికరమైన ఆహార పదార్థాలతో స్టాల్‌ను ఏర్పాటు చేశారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. తొలుత జరిగిన సమావేశానికి ఐసీడీఎస్ భీమడోలు పీవో కేవీ విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, ఎంఈవో అయినపర్తి భాస్కర్‌కుమార్, సూపర్‌వైజర్లు షాహనాజ్‌బేగం, నూర్జహాన్, కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

ఏలూరు రూరల్ : భారీ వర్షాలు, కొల్లేరు వరద కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి కె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జాలిపూడిలో ముంపుబారిన పడిన పంటచేలను పరిశీలించారు. వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటచేలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అధికారులు పంట నష్టాలను నమోదు చేసిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. వాస్తవాల ఆధారంగా సాగుదారులైన కౌలురైతుల పేర్లతో నష్టాన్ని నమోదు చేయాలన్నారు.

రైతు సంఘాల రాస్తారోకో

ఏలూరు (టూటౌన్): విశాఖపట్టణం స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని నిరసిస్తూ కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ వద్ద మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలి, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలి, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలంటూ నినదించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు డీఎన్‌వీడీ ప్రసాద్, కె.బుచ్చిబాబు, బద్దా వెంకట్రావులు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల మద్దతుతో కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో ప్రభుత్వం వెనుకడుగు వేసిందని తెలిపారు. మోదీ ప్రభుత్వం పథకం ప్రకారమే స్టీల్ ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతుందని ఆరోపించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్టీల్ ప్లాంట్‌ని సందర్శించిన కేంద్ర మంత్రి కుమార స్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మ దేశంలోనే అత్యుత్తమ స్టీల్ ప్లాంట్ విశాఖ అని కొనియాడారని తెలిపారు. టీడీపీ మద్దతుతో కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వాన్ని చంద్రబాబు నాయుడు స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కనీసం ప్రయత్నించడం లేదని ఆరోపించారు. తక్షణం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు డేగా ప్రభాకర్, కె.శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు బండి వెంకటేశ్వరరావు, రాజనాల రామ్మోహనరావు, రెడ్డి శ్రీనివాస డాంగే, ఎం కృష్ణ చైతన్య, కె.కృష్ణమాచార్యులు, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- వరద సహాయక చర్యలు శూన్యం
- మాజీ ఎమ్మెల్యే వాసుబాబు



పుప్పాల వాసుబాబు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే

గణపవరం: సంక్షోభాలను తనకు అవకాశంగా మలుచుకునే నేర్పు కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ వరదలను కూడా తనకు అనుకూలంగా మలుచుకోవడంలో చూపిన శ్రద్ధ బాధితులను ఆదుకోవడంలో చూపలేదని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు విమర్శించారు. మంగళవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ కేవలం కరకట్టమీద ఉన్న తన అక్రమ నివాసం మునిగిపోకుండా కాపాడుకోవాలన్న తాపత్రయంతోనే చంద్రబాబు విజయవాడను ముంచేశారని విమర్శించారు. ఆయన నివా సం ముంపునకు గురవడం వల్లనే కలెక్టరు కార్యాలయంలోనే ఉండి వరద సహాయక చర్యలను దగ్గరుండి చూసుకుంటున్నానంటూ కొత్త డ్రామాకు తెరతీశారన్నారు. వరద బాధితులను కనీసం ఆదుకోలేదని, స్వచ్ఛంద సంస్థలు, దాతలు రాకపోతే విజయవాడలోని వేలమంది వరద బాధితులు ఆకలి దప్పులతో అలమటించేవారన్నారు. రోజూ బుల్డోజర్లు, పడవలు, జీపులు ఎక్కి చేతులూపుతూ, ప్రధాన రోడ్లపై తిరగడంతప్ప ఎప్పుడైనా సందుల్లో ఉన్న బాధితుల వద్దకు వెళ్లారా అని ప్రశ్నించారు. కరోనా వంటి మహావిపత్తును ఒంటిచేత్తో ఎదుర్కొన్న వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌ను విమర్శిస్తూ, వరదలు రావడానికి కుట్రలు, కుతంత్రాలు ఉన్నాయంటూ అసలు విషయాన్ని పక్కదారి పట్టించడానికి చంద్రబాబు తాపత్రయపడటం సిగ్గుచేటన్నారు. గతంలో సచివాలయం భవనాల శ్లాబులు లీకై గదుల్లోకి వర్షం నీరుకారితే అందులోనూ వైఎస్సార్ సీపీ కుట్రఉందంటూ ప్రచారం చేశారని గుర్తుచేశారు. బుడమేరు గేట్లు ఎత్తివేసే పరిస్థితి వచ్చిందని ఒక రోజు ముందుగానే ఇరిగేషన్ డీఈ, రెవెన్యూ అధికారులు తెలియజేసినా, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. వరద ముప్పుపై ఆయా ప్రాంతాల్లో ప్రజలను హెచ్చరించినా ఎవరికివారు జాగ్రత్త పడినా కొంత మేర వరద నష్టం నుంచి బయటపడేవారని వాసుబాబు అన్నారు. అధికారుల హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోకపోవ డం వల్లనే ఇంతటి ఘోర విపత్తు జరిగి మూడు లక్షల మంది ప్రజలు పదిరోజులుగా నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. వరద ప్రాంతాలకు తాను వస్తే అధికారులు తనచుట్టూ తిరుగుతూ సహాయ కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుందని పవన్‌కల్యాణ్ చెబుతుండగా, చంద్రబాబు మాత్రం అధికార యంత్రాంగాన్ని తనచుట్టూ పెట్టుకుని విజయవాడ వీధుల్లో ఆర్భాటంగా తిరగడం ఏమిటో ప్రజలకు అర్థం కావడం లేదన్నారు.ఇప్పటికైనా చంద్రబాబు తన ప్రచార ఆర్భాటాలకు స్వస్తిచెప్పి వరద బాధితులను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని వాసుబాబు హితవు పలికారు.

రహదారికి ఇరువైపులా తుప్పల తొలగింపు



ఉంగుటూరులో రహదారిపైకి వచ్చిన తుప్పలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఉంగుటూరు: రహదారికి ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరగడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడే వారు. ఉంగుటూరులో ప్రధాన కాలువ రేవు అపరిశుభ్రంగా తయారవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సర్పంచి బండారు సింధు, కార్యదర్శి గిరి దీనిపై స్పందించి పంచాయతీ సిబ్బందితో మంగళవారం పారిశుధ్య పనులు ప్రారంభించారు. కోనేరుపేటలో కొన్ని వీధుల్లో, రెండో వార్డులో ఈ పనులు నిర్వహించారు. ఈ కాలువ రేవును వినాయకుని నిమజ్జనం కార్యక్రమానికి భక్తులు వినియోగిస్తారు. రేవులో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన తుప్పలను తొలగించారు.

గణనాథుడికి ప్రత్యేక అలంకరణ



చల్లచింతలపూడిలో వినాయకుడిని పూజిస్తున్న గ్రామ యువత



భీమడోలులో కాషాయ వర్ణంలో గణనాథుడు

భీమడోలు: భీమడోలు గణపతి సెంటర్‌లోని శ్రీమన్మహా గణనాథుని 60వ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. నాల్గవరోజైన మంగళవారం స్వామి వారు భక్తులు కాషాయ వర్ణంతో దర్శనమిచ్చారు. కళావేదికపై ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మండల వ్యాప్తంగా భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, పోలసానిపల్లి, కొల్లేరు గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఉత్సాహంగా వినాయకుని ఉత్సవాలు

దెందులూరు: వినాయకచవితి ఉత్సవాలు గ్రామ గ్రామాన ఘనంగా కొనసాగుతున్నాయి. చల్లచింతలపూడిలో స్థానిక యువత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దెందులూరు గౌడవీధిలో రామమారుతీ సంఘం ఆధ్వర్యంలో గౌడ్‌యూత్ స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.

12 నుంచి 'మద్ది' పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం రూరల్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రముఖ హనుమాన్ క్షేత్రమైన జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో ఈనెల 12 నుంచి 15 వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. అత్యంత వైభవంగా పవిత్రోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పవిత్రోత్సవాల్లో భాగంగా 12వ తేదీ మధ్యాహ్నం 1 గంట నుంచి గర్భాలయ దర్శనం నిలిపివేస్తామని, తిరిగి 15వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గర్భాలయం దర్శనం పునః ప్రారంభిస్తామని ఈవో తెలిపారు. అర్చకులు వేదాంతం రంగప్రసాద్ మాట్లాడుతూ ఆలయ పవిత్రతను కాపాడేందుకు, అర్చనాధి, కైంకర్యాలలో, భక్తులు, సిబ్బంది, అర్చకుల ద్వారా చేసిన దోషాలు తొలగించి ఆలయానికి పవిత్రత చేకూర్చేందుకు పవిత్రోత్సవాలను నిర్వహిస్తామన్నారు.

చేపలను కాపాడుకునేందుకు అగచాట్లు

ఏలూరు రూరల్ : కొల్లేరును ముంచిన వరదనీరు చేపల చెరువుల యజమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. చెరువుల్లో కోట్ల రూపాయల మత్స్య సంపద కాపాడుకునేందుకు యజమానులు నానా అగచాట్లు పడుతున్నారు. వరద తాకిడికి చేపలు కొల్లేరులోనికి కొట్టుకుపోకుండా చెరువుల చుట్టూ వలలు కట్టుకుంటున్నారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు వందలాది ఎకరాల చెరువులకు వలలు కడుతున్నారు.

లక్షల్లో ఖర్చు

చెరువుల్లో చేపల కొట్టుకుపోకుండా కాపాడుకోవడం యజమానులకు తలకు మించిన భారంగా మారింది. ఇందుకోసం లక్షల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు. పెదయాగనమిల్లిలో ఓ సాగుదారుడు 100 ఎకరాల చెరువు చుట్టూ వల కట్టేందుకు రూ.2 లక్షలు ఖర్చు చేశారు. పదుల సంఖ్యలో కూలీలను రప్పించారు. ప్రమాదకర స్థితిలోనే వరద ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువు చుట్టూ వల కట్టించారు. ఇందుకోసం కూలీలకు మరో రూ.30 వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇలా ఏలూరు రూరల్ మండలం కొల్లేరు గ్రామాల్లో వందల ఎకరాల్లో యజమానులు చెరువులు చుట్టూ వలలు కట్టారు. అయినప్పటికీ కొన్నిప్రాంతాల్లో వల ఎత్తుకు అడుగు దూరంలో వరద ప్రవహిస్తోంది. వరద మరింత పెరుగుతుందన్న భయంతో పలువురు యజమానులు లక్షల రూపాయలు ఖర్చు పెట్టలేక చేతులు ఎత్తేశారు.